క్లుప్తంగా

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం జగనన్న లక్ష్యం



పట్నంబజారు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిందని, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 18వ డివిజన్ ఆర్.అగ్రహారం, ఏడుగొందుల సందు, ఇసుకవారివీధి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని గెలిపించాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ పేదల పక్షపాతిగా సీఎం వైఎస్ జగనన్న అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా దివంగత మహానేత డాక్టర్‌వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళుతూ సీఎం జగనన్న సుపరిపాలన అందించారన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, పల్లపు దుర్గాప్రసాద్, నూనె కిషోర్, మద్దాళిసుధాకర్, పెప్సిశ్రీను, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్యశాఖలో ఆయన ఓ జిల్లా అధికారి. వేసవిలో ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో వేసవి జాగ్రత్తల గురించి వైద్యులు, వైద్య సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు వివరించటం ప్రథమ కర్తవ్యం. ఆయన ఒక పక్క విధులు నిర్వహిస్తూనే మరో పక్క సేవా కార్యక్రమానికి పూనుకున్నాడు. తన సొంత డబ్బులు వెచ్చించి తన కార్యాలయం ఎదురుగా మజ్జిగ పంపిణీ చేశారు. ఆయనే ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్(డీసీహెచ్ఎస్) డాక్టర్ కొండూరు సుబ్రహ్మణ్యరాజు. బుధవారం స్థానిక పట్టాభిపురంలోని వైద్య విధాన పరిషత్ కార్యాలయం ఎదుట సుమారు 500 మందికిపైగా ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.

ఏఎన్‌యూ అమెరికన్ యూనివర్సిటీలతో ఎంఓయూ

ఏఎన్‌యూ: అమెరికాకు చెందిన టెక్సాస్ వెస్లియాన్ యూనివర్సిటీ, లెటర్నియో యూనివర్సిటీలతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంఓయూ కుదుర్చుకుంది. టెక్సస్ వెస్లీయాన్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అడ్మిషన్ కోఆర్డినేటర్ జూలిస్మిత్ బృందం గురువారం ఏఎన్‌యూని సందర్శించింది. యూనివర్సిటీ సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని బృంద సభ్యులు సందర్శించారు. ఆ విభాగంలోని మౌలిక వసతులు, పరిశీలించారు. ఫార్మసి, ఫిజిక్స్, బుద్దిస్ట్ స్టడీస్ విభాగాలను సందర్శించి విదేశీ విద్యార్థులతో మాట్లాడారు. అంతర్జాతీయ విద్యార్థుల వసతి గృహం సందర్శించి సదుపాయాలను విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైస్ చాన్సలర్ ఆచార్య పి.రాజశేఖర్‌తో సమావేశమయ్యారు. ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ జి.చెన్నారెడ్డి, రెక్టార్ వరప్రసాదమూర్తి, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఉదయకుమార్ పాల్గొన్నారు.

ఏ అవసరం ఉన్నా నేనున్నా!

- పశ్చిమ ప్రజల ప్రేమను ఎప్పటికీ మరువను
- వారి ఆదరణకు రుణం తీర్చుకుంటా
- నా గెలుపు పశ్చిమ ప్రజలందరీ గెలుపు
- జగనన్న పథకాలే నన్ను గెలిపిస్తాయి

సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పశ్చిమ అసెంబ్లీ అభ్యర్థి విడదల రజిని

సాక్షి ఇంటర్వ్యూ



పట్నంబజారు : మీ ఇంటి ఆడపడుచుగా మీ అందరి మీద నమ్మకంతో .. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. ఏ సమస్య వచ్చినా నేనున్నా.. ఎటువంటి ఇబ్బందినైనా అడ్డుగోడలా అడ్డుపడతా.. ఇబ్బందికర పరిస్థితుల్లో కవచకుండలమై కాపలా కాస్తా.. ఏ ఇంట కష్టమొచ్చినా మా ఇంటి బిడ్డ ఉందనే ధైర్యాన్ని ప్రతి ఒక్కరిలో కల్పిస్తా.. మీ బిడ్డల భవిష్యత్‌లో మేలు జరిగేందుకు అహర్నిశలు పాటుపడతా.. మీ ఇంట సంతోషాలు కురిపించేలా ప్రతి ఒక్క పథకాన్ని మీ గడపముందుకు చేరుస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ అసెంబ్లీ అభ్యర్థి విడదల రజిని స్పష్టం పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం మంత్రి విడదల రజిని నియోజకవర్గంలో ప్రజలకు చేరువుతున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరితో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు. టీడీపీకి కంచుకోటగా చెప్పుకునే నియోజకవర్గంలో ఆ పార్టీ నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ప్రచారంలో ప్రజలు చూపే అభిమానం.. ఆమెపై ప్రతి ఒక్కరూ చూపిస్తున్న అభిమానం రానున్న ఎన్నికల్లో విజయ శంఖం పూరించడం తథ్యమని చాటి చెబుతోంది. కొత్తగా పార్టీ కార్యాలయం ప్రారంభానికి ఏర్పాట్లు మంత్రి చేసుకుంటే.. రాత్రికి రాత్రి టీడీపీ అల్లరి మూకలు కార్యాలయంపై రాళ్లు విసిరి ధ్వంసం చేశాయి. అయినా సరే మంత్రి రజిని సహనాన్ని ప్రదర్శించారు. సంయమనం చూపిన ఆమె మరోసారి గుంటూరు ప్రజలతో శభాష్ అనిపించుకున్నారు. నాలుగే నాలుగు నెలల్లో గుంటూరులోని కీలక రోడ్లన్నింటికీ మరమ్మతులు వేయించారు. ఏటీ అగ్రహారం లాంటి అత్యంత రద్దీ ఉండే ప్రధాన రహదారికి మోక్షం కలిగించారు. ఈ పనులు చూసి నగరం మురిసిపోయింది. రజినమ్మే తమ నాయకురాలని పొంగిపోయింది. ఆమెను గెలిపించుకునేందుకు గుంటూరు పశ్చిమం సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో ఎన్నికల కురు క్షేత్రం జరుగనున్న నేపథ్యంలో ఆమె 'సాక్షి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ప్రశ్న: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

జవాబు: అద్భుతంగా సాగుతోంది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం సాగుతోంది. ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ ముందు ఎండ వేడిగాని, ఉక్కపోతగాని.. ఇవేవీ నాకు కనిపించడం లేదు. నా కష్టం, నా స్వేదం.. అన్నీ తక్కువే.

ప్ర: గుంటూరు పశ్చిమ సమన్వయకర్తగా మిమ్మల్ని ప్రకటించిన తొలి రోజుల్లోనే మీ పార్టీ కార్యాలయం దాడికి గురైంది. ధ్వంసం చేశారు. అయినా మీరు ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు దిగలేదు. దీనిపై మీ అభిప్రాయం?

జ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నా పేరు ప్రకటించగానే ఇక్కడ ఓటమి తప్పదని టీడీపీ భావించింది. ఆ ఓటమి భయంతోనే నా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయాలని చూశారు. భయపెట్టి ఏదో సాధించాలని చూశారు. ఇక్కడ ఉంది విడదల రజిని. ఆ విషయాన్ని టీడీపీ గుర్తిస్తే మంచింది. తాటాకు చప్పుళ్లకు భయపడే రకం కాదు నేను. మా నాయకుడు మాకు ఇచ్చిన ఆయుధం ధైర్యం. వైఎస్సార్ సీపీ నుంచి నేను నేర్చుకున్నది సహనం. ఆ సహనంతోనే ముందుకు సాగుతున్నాం. దాడులకు ప్రతిదాడులు, కక్ష సాధింపు చర్యలకు నేను వ్యతిరేకం. శాంతియుతంగానే పోరాడుతాం. చట్టపరంగానే ముందుకు వెళతాం. అంతే తప్ప హింసలకు తావీయడం, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం మాకు తెలీదు.

ప్ర: గుంటూరు నగరంలో అనారోగ్య సమస్యలు చుట్టుముట్టినప్పుడు ప్రతిపక్షాలు మిమ్మల్నే లక్ష్యం చేసుకున్నాయి. కదా?

జ: అవును! గత ఫిబ్రవరి నెలలో గుంటూరు నగరంలో పలువురికి అనారోగ్య సమస్యలు తలెత్తాయి. వాంతులు, విరేచనాల కేసులు నమోదయ్యాయి. ఇలాంటి సమయంలో నాయకురాలిగా ప్రజలకు పూర్తిస్థాయిలో అండగా నిలబడి సమస్య పరిష్కారానికి కృషి చేశాం. చిత్తశుద్ధితో పక్షం రోజులు పనిచేశాం. అధికారులతో సమీక్షలు నిర్వహించాను. ప్రభుత్వాస్పత్రికి మూడు పర్యాయాలు వెళ్లాను. రోగులను పరామర్శించాను. కార్పొరేషన్ అధికారులతో సమీక్ష చేశాను. తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశాం. జిల్లా ఉన్నతాధికారులను, నగరపాలక సంస్థ ఉన్నతాధికారులను అప్రమత్తం చేశాం. నా సొంత శాఖ అయిన వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను గుంటూరులోనే తిష్టవేసేలా చేసి పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చేలా చేశాను. ఈ చర్యలు తీసుకోవడం వల్లనే పరిస్థితి అదుపులోకి వచ్చింది. నష్ట నివారణ సులువు అయింది. ఒకరు మరణిస్తే.. ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం కూడా అందించాం. ఒక విపత్తు వచ్చినప్పుడు.. ప్రజల చూపంతా వారి నాయకుడిపైనే ఉంటుంది. ఆ నాయకుడు బాగా పనిచేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. గుంటూరులో గత ఫిబ్రవరిలో జరిగింది కూడా ఇదే.

ప్ర: ప్రజలకు మీరు ఇచ్చే సందేశం

జ: ప్రజలను నేను ఒకటే కోరుతున్నాను. నేను గుంటూరు బాధ్యతలు తీసుకుని ఐదునెలలే. ఈ ఐదు నెలల కాలంలో గుంటూరులో ఎన్ని రోడ్లకు మరమ్మతులు ఏ విధంగా చేశామో ప్రజలే చూశారు. ఎన్ని కొత్త రోడ్లకు శంకుస్థాపన చేశామో కూడా చూశారు. దశాబ్దాలుగా అటకెక్కిన రోడ్లన్నింటికీ నేను స్వయంగా శ్రద్ధ తీసుకుని మోక్షం కలిగేలా చేశాను. ఐదు నెలల కాలంలోనే ఇంత చేసిన దాన్ని ఐదేళ్లు ఇక్కడే ఎమ్మెల్యేగా ఉంటే.. ఇంక ఎంత చేయొచ్చో ఒకసారి ప్రజలే అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను. నా ఆలోచనలకు ప్రజల సహకారం కూడా తోడైతే అద్భుతాలు చేస్తానని మాట ఇస్తున్నాను.



ప్ర: మీ గెలుపుపై మీకున్న నమ్మకం ఏంటి..?

జ: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలవబోతుంది. గెలిచేది నేనే. మా నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలే మా గెలుపునకు కారణం. జగనన్న చిత్తశుద్ధి, సంకల్పం వల్ల ఈ రోజు రాష్ట్రంలోని పేదలంతా ఎంతో ఆనందంగా ఉన్నారు. వారి ఆనందాన్ని రేపటి ఎన్నికల్లో ఓట్ల ద్వారా వ్యక్తపరచబోతున్నారు.

ప్ర: గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అంటే టీడీపీకి కంచుకోటగా పేరుంది. మరి ఇలాంటి చోట గెలుపు సాధ్యమేనా! ప్రత్యేక ప్రణాళిక ఏమైనా ఉందా..?

జ: వాస్తవానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీకి కంచుకోట ఏమీ కాదు అనేది నా ఉద్దేశం. వైఎస్సార్ సీపీ ఆవిర్భ నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా గెలవలేదు కాబట్టి బహుశా ఈ ప్రచారం ఉండి ఉంటుంది. గత ఎన్నికలన్నీ దాదాపు ముక్కోణపు పోటీ ఉండటం వైఎస్సార్ సీపీ ఓటమికి ప్రధాన కారణమై ఉండొచ్చు. ఈ ఎన్నికల్లో మాత్రం వైఎస్సార్ సీపీ తొలిసారి గెలవబోతోంది. ఈ నియోజకవర్గంలో సగర్వంగా పార్టీ జెండా పాతబోతున్నాం. పార్టీ గెలుపునకు ప్రత్యేకమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. అంతకుమించి మా నాయకుడు మాకు ఇచ్చిన ధైర్యం.. మా ప్రభుత్వ పనితీరు. ప్రతి గడపకూ చేరిన మా సంక్షేమ పథకాలు కూడా రేపటి మా గెలుపును నిర్ణయించబోతున్నాయి.

ప్ర: గుంటూరు నగరాన్ని ఎలా అభివృద్ధి చేయాలనుకుంటున్నారు.



జ: రేపు మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరానికి సంబంధించి నా వద్ద చాలా ఆలోచనలు ఉన్నాయి. అవన్నీ అమలు చేయడం లక్ష్యంగా పనిచేస్తాను. విద్య, వైద్య రంగాలకు సంబంధించి గుంటూరుకు రాష్ట్రంలోనే గొప్ప చరిత్ర ఉంది. పెద్ద పెద్ద విద్యాసంస్థలు, వైద్య సంస్థలు గుంటూరులో ఉన్నాయి. భవిష్యత్ అవసరాలకు సరిపడా విద్య, వైద్యం విషయంలో గుంటూరును మరింత ఉన్నతంగా తయారుచేసుకోవాల్సి ఉంది. విద్యా రాజధానిగా గుంటూరుకు పేరుంది. అందుకు తగ్గట్లే మరింతగా అభివృద్ధి చేసుకోవాలి. అందుకోసం ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు కృషి చేస్తాను. మెడికల్ హబ్ ఏర్పాటుకు దిశగా కూడా చర్యలు తీసుకుంటాం. గుంటూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రత్యేకంగా ఒక పార్కు తీసుకొచ్చేలా ప్రణాళిక రూపొందించుకున్నాను.

టీడీపీకి మహిళలే బుద్ధి చెబుతారు

- దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులు చేయాలని కుట్ర
- న్యాయంగా గెలవలేమని అడ్డదారిలో యత్నాలు
- నీతికి, నిజాయతీకి, ధర్మానికే పట్టం కడతారు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు 39, 44 డివిజన్లలో మనతో మన రజినమ్మ కార్యక్రమం



కరపత్రాలు అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ అభ్యర్థి కిలారి, మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరిధర్, లాల్‌పురం రాము

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ మహిళా నాయకులపై దాడులు చేసి, రాష్ట్రంలోని మహిళలను భయభ్రాంతులకు గురి చేయాలని టీడీపీ దుష్ట పన్నాగం పన్నుతోందని, మహిళలంతా ఆదిశక్తులై టీడీపీని భస్మం చేస్తారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని 39, 44 డివిజన్లలో గురువారం మనతో మన రజినమ్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలంతా జగనన్న వైపే ఉన్నారనే భయంతో టీడీపీ నాయకులు మహిళలపై దాడులు చేసి, వారిని పోలింగ్‌కు రాకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. మాచర్లలో ఎమ్మెల్యే పీఆర్కే సతీమణిపైనా, నల్లజర్లలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పైనా దాడులకు పాల్పడటం ఇందులో భాగమేనన్నారు. ఎన్నికల్లో న్యాయబద్ధంగా గెలవలేమనే భయంతోనే టీడీపీ అడ్డదారులు తొక్కుతోందని, వారెన్ని కుటిల యత్నాలు, కుతంత్రాలు చేసినా ప్రజలు వాటిని భగ్నం చేసి తీరుతారని అన్నారు. మరోమూడురోజుల్లో జరుగబోయే యుద్ధంలో సంక్షేమ సారథికి అండగా నిలబడాలని కోరారు.

జగనన్నకు తిరుగులేదు

44వ డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో జగనన్నకు ఎప్పటికీ తిరుగు ఉండదని, అనేక సంక్షేమ పథకాల ద్వారా రికార్డు సష్టించిన ఏకైక సీఎం జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుని ప్రతి ఒక్కరికి కుటుంబ సభ్యుడిగా తానున్నాననే భరోసా కల్పించిన ఏకైక నేత సీఎం జగన్ అని అన్నారు. రాష్ట్ర ప్రజలంతా ముక్తకంఠంతో రానున్న ఎన్నికల్లో తిరిగి భారీ మెజారిటీతో అధికారంలోకి తీసుకొస్తామని సుస్పష్టంగా చెబుతున్నారన్నారు.

చంద్రబాబు బూటకపు మాటలు నమ్మొద్దు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ చంద్రబాబు సంపద సృష్టిస్తాననడం పచ్చి బూటకమని మండి పడ్డారు. బాబు సీఎంగా చేసిన 14 ఏళ్ల కూడా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో రెవెన్యూ లోటే అని ప్రభుత్వ రికార్డులే చెబుతున్నాయన్నారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో చంద్రబాబు మాయమాటలు నమ్మేంత పిచ్చివాళ్లు ఎవరూ లేరన్నారు.

పేదలంటే చంద్రబాబుకు చులకన: రావెల

మాజీ మంత్రి, పార్టీ నేత రావెల కిషోర్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబుకు ఎస్సీలన్నా, పేదలన్నా చులకన అని, ఐదేళ్లకోసారి పేదల ఓట్లు డబ్బులతో కొని గెలవచ్చనే అహంకారం ఆయనదన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు రాతంశెట్టి రామాంజనేయులు (లాలుపురం రాము) మాట్లాడుతూ గుంటూరు వెస్ట్‌లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని అన్నారు. తొలుత మంత్రి రజిని 39వ డివిజన్‌లోని కృష్ణబాబు కాలనీ, గుజ్జనగుండ్ల ఆంజనేయస్వామి గుడి ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు మార్కెట్ బాబు, డివిజన్ అధ్యక్షుడు షఫీ పాల్గొన్నారు. 44వ డివిజన్ పరిధిలో నాయుడుపేట, సాకేతపురం మెయిన్‌రోడ్డు, జెండా చెట్టు సెంటర్, ఆంజనేయపేట, రెడ్ల బజారు, చెరువుకట్ట, గౌతమీ నగర్ ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు వంగల వలివీరారెడ్డి, పోకల వసంత్, విష్ణువర్ధన్‌రెడ్డి, కారసాని స్టీఫ్ , సంజీవ్, చిలకా సురేష్, కాకి శ్రీనివాసరావు, సుబ్బారావు పర్యటించారు.

ఊసరవెల్లిని తలపించేలా చంద్రబాబు హామీలు

ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి



పార్టీలో చేరిన వారితో విప్ అప్పిరెడ్డి

పట్నంబజారు: చంద్రబాబు మేనిఫెస్టో హామీలు, కోటలు దాటుతున్న కూటమి మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని, బాబును నమ్మితే ఊసరవెల్లిని తలపించేలా రంగులు మారుస్తారని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల టీడీపీలో చేరిన 29వ డివిజన్‌లోని నల్లకుంటకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. విప్ లేళ్ల అప్పిరెడ్డి సమక్షంలో గురువారం చేరారు. నల్లకుంటలోని భవనం బ్రహ్మారెడ్డి కాటన్ మిల్లులో స్థానిక కార్పొరేటర్ షేక్ రోషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడారు. పార్టీలో చేరిన వారిలో గోగుల వీరాంజి, వేముల గోపి, దేవళ్ళ రాజు, గోగుల వెంకట్, మేడిశెట్టి వంశీ, మాదుగుల చిన్నబాబు, మాదుగుల జోజిబాబు, నాగరాజుతో పాటు నల్లకుంటకు చెందిన 50 కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు.

పశ్చిమలో 79.40 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

నెహ్రూ నగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ కి దరఖాస్తు చేసుకున్న 4,361 మందిలో 3,463 మంది(79.40 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని గుంటూరు అదరపు కమిషనర్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి గురువారం తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ముగిసిందని చెప్పారు.

ఓటరూ మేలుకో.. ఓటు వేసి బాధ్యత పెంచుకో

- గుంటూరు పశ్చిమలో పోలింగ్ శాతం అత్యల్పం
- గత ఎన్నికల్లో 65.7 శాతం నమోదు
- ఓటు హక్కు వినియోగంపై ఆసక్తి చూపని నగరవాసులు
- ఓటర్ల సంఖ్య 2,78,158
- పురుషులను అధిగమించి పైచేయి సాధించిన మహిళా ఓటర్లు



గత నెల 27న గుంటూరులో ఓటు హక్కుపై చైతన్య పరుస్తూ 3కే వాక్

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నికల పండుగొచ్చింది. దేశంలో సందడి నెలకొంది. పల్లె నుంచి పట్టణం వరకు పిల్లపాపల నుంచి వృద్ధుల వరకు ఎన్నికలు ఓ ఉత్సాహాన్ని నింపుతాయి. అలాంటి ఎన్నికలపై పట్టణ వాసులు కినుక వహించడం ఆందోళన కలిగిస్తోంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో నగర ఓటర్లు వెనుకడుగువేస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఓటింగ్ 65.7 శాతానికి పరిమితం కావడం ఇందుకు నిదర్శనం. అంటే ఈ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన ప్రతి వంద మంది ఓటర్లలో 65 మందే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన 35 మంది గడప దాటలేదు. విద్యావంతుల నిలయంగా, గుంటూరు జిల్లా కేంద్రంగా ఉన్న పశ్చిమ నియోజకవర్గం విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందింది. రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైన నియోజకవర్గం ఓటింగ్‌లో మాత్రం రాష్ట్ర స్థాయిలో వెనుకబాటుకు గురవుతోంది. విద్యాపరంగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు కలిగిన నియోజకవర్గం వ్యాపార కేంద్రంగాను విరాజిల్లుతోంది. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నగర ఓటర్లు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని గుర్తెరిగి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేస్తోంది.

సంవత్సరం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
2019	1,31,526	1,37,638	54	2,69,218
2024	1,35,426	1,42,688	44	2,78,158

పోలింగ్ 65.7 శాతానికి పరిమితం..

2019 ఏప్రిల్ 11న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో 65.7 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,65,135 మంది ఓటర్లలో 1,74,147 మంది ఓటనర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన 90,988 మంది ఓటు వేసేందుకు గడప దాటలేదు.

పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు

నగరంలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికార యంత్రాంగంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఓటరన్లు చైతన్యపర్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే దిశగా చైతన్యపరుస్తున్నాయి. ఇందులో భాగంగా తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతను చైతన్యపరుస్తూ గత నెల 27న బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఓటర్ల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెంచే ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని చాటుతూ నిర్వహించిన 3కే వాక్‌లో వందలాదిగా ప్రజలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

జనం కోసం 130 సార్లు బటన్ నొక్కిన సీఎం జగన్

శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి ఎన్నికల ప్రచారం



ప్రభుత్వ విప్ అప్పిరెడ్డికి హారతిస్తున్న మహిళలు

పట్నంబజారు: మన అభివృద్ధి కోసం.. మన సంక్షేమం కోసం.. 130 సార్లు బటన్ నొక్కిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునేందుకు రెండు సార్లు బటన్ నొక్కేందుకు రాష్ట్రవ్యాప్తంగా జనం సిద్ధమయ్యారని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరులో ఒక బటన్ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి విడదల రజినికి... రెండో బటన్ పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్యకు నొక్కి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారితో కలిసి లేళ్ల అప్పిరెడ్డి గడప గడపకు తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. లక్ష్మీనగర్‌లో జరిగిన సభలో లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ, మరికొన్ని రోజుల్లో కురుక్షేత్ర మహాసంగ్రామం జరగబోతుందన్నారు. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్యో లేక కొన్ని పార్టీల మధ్య జరుగుతున్న ఎన్నికలు కావనీ.. కేవలం ఎంపీలు, ఎమ్మెల్యేలను మాత్రమే ఎన్నుకునేందుకు జరగబోతున్న ఎన్నికలు కూడా కానే కాదన్నారు. పేదలకి పెత్తందార్లకు మధ్య జరగనున్న ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్ల మన ఇంటింటి అభివృద్ధిని, పథకాల కొనసాగింపును నిర్ణయించబోయే ఎన్నికలని చెప్పారు. ఈ ఎన్నికల్లో మీరు వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తే ప్రతి గడపలో ప్రగతి, బంగారు భవిష్యత్తు, సంక్షేమ పథకాల కొనసాగింపు జరుగుతుందన్నారు. అదే పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నింటికీ ముగింపు పలకడం ఖాయమన్నారు. మళ్లీ మోసపోవడం తథ్యమని.. ఇదే చంద్రబాబు గత చరిత్ర చెబుతున్న సత్యమన్నారు.

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న విడదల రజిని ఎమ్మెల్యేగా చిలకలూరిపేట అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా తన సమర్థతను నిరూపించుకున్నారని లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. గుంటూరు పార్లమెంటు స్థానం నుంచి ఎన్నికల బరిలో దిగిన స్థానికుడైన కిలారి రోశయ్య ఎమ్మెల్యేగా పొన్నూరు సమగ్రాభివృద్ధికి కట్టుబడిన తీరు అందరికీ తెలిసిందేనని చెప్పారు. ఇద్దరూ కూడా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా నిరంతరం ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో పని చేసేవారేనని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రెండు ఓట్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకే వేసి జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిర్చియార్డు డైరెక్టర్ పి.బాలిరెడ్డి, ఉపేంద్ర, కాశిరెడ్డి, కృష్ణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, బెంజి, చిన్నా, శంకర్‌రెడ్డి, మామిడి వెంకటేశ్వర్లు, శ్రీను, శేఖర్, అనూరాధ, నాగలక్ష్మి, అరుణ, ఆదర్శనగర్, లక్ష్మీనగర్, సాయినగర్ ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.